ఈనాడు అన్నమయ్య

ఆదివారం అక్టోబరు 20, 2024

గురుకులం... వానొస్తే కలవరం!



శిథిలావస్థలో గురుకుల పాఠశాల భవనాలు



గ్యారంపల్లె బాలుర గురుకుల పాఠశాల తరగతి గదులు వర్షాలకు ఉరుస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో తరగతిగదులతోపాటు వసతి భవనాలు కూడా ఉరుస్తున్నాయి. భవనాల పైకప్పు శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ 464 మంది విద్యార్థులు చదువుతున్నారు. పైకప్పు పెంకులు ఎప్పుడు మీద పడతాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపల్ బ్రహ్మాజీ మాట్లాడుతూ తరగతి గదులు, డార్మెటరీ భవనాలు ఉరుస్తున్నాయని, ఇబ్బందులు పడుతూ పాఠ్యాంశాలు బోధిస్తున్నామన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో భయం భయంగా నిర్వహణ సాగిస్తున్నామన్నారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కంభంవారిపల్లె**

అమ్మాయిలపై అఘాయిత్యాలు!



అమ్మాయిల ప్రాణ, మానాలకు రక్షణ లేకుండాపోతోంది. వీరిపై ఏదోఒక చోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రేమ పేరిట వేధింపులు, ఆపై ఘాతుకాలు పెరిగిపోతున్నాయి. చిన్నారులపైనా లైంగిక దాడులు కొనసాగుతున్నాయి. ఫలితంగా తల్లిదండ్రులకు గర్భశోకం మిగులుతోంది. తమ పిల్లల భద్రతపై వారు భయాందోళనకు గురవుతున్నారు. యువకులు తమ వికృత చేష్టలతో నేరాలకు ఒడిగడుతున్నారు. వైఎస్‌ఆర్ జిల్లా బద్వేలులో శనివారం జరిగిన ఉదంతమే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనలో నిందితుడికి భార్య ఉంది. అందులోనూ గర్భవతి కూడా. ఈ తరుణంలో యువకుడు ఇంటర్మీడియట్ చదువుతున్న బాలిక వెంటపడుతూ వేధిస్తూ పెట్రోలు పోసి నిప్పంటించాడు. కళాశాలలో ఉన్న అమ్మాయిని బెదిరించి బలవంతంగా బయటకు తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. వైఎస్‌ఆర్, అన్నమయ్య జిల్లాల్లో గత రెండేళ్లలో చోటుచేసుకున్న దుర్ఘటనలతో అమ్మాయిలు, బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. **- ఈనాడు, కడప**

బి.కోడూరులో యువతి హత్య

బి.కోడూరు మండలానికి చెందిన ఓ డిగ్రీ విద్యార్థిని సిద్దవటం మండలం పెన్నానదిలో శవమై తేలింది. కళాశాలకు వెళ్లిన విద్యార్థిని కొందరు యువకులు సిద్దవటం కోటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత అమ్మాయి కనిపించలేదు. పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతోపాటు అనుమానిత యువకుల పేర్లను సూచించారు. మూడు రోజుల అనంతరం నదిలో శవమై తేలింది. ఈ కేసును రాజకీయ కారణాలతో ముందుకు సాగకుండా నిలిపివేశారు. అప్పట్లో పోలీసుల తీరుపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటన కూడా ప్రేమ పేరుతోనే విషాదంగా మారింది.

కురబలకోటలో ఆరేళ్ల బాలిక హత్య

కురబలకోటలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అప్పట్లో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఘటనపై సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన సైతం చేపట్టాయి. నిందితుడిని బహిరంగంగా ఉరితీయాలంటూ డిమాండు చేశాయి. ఈ ఘటన స్థానికంగా పెద్దఎత్తున కలకలం రేపింది.

బద్వేలులో కొడవలిలో నరికి...

బద్వేలు గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ అమ్మాయిని (19) తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలంటూ ఓ యువకుడు వేధిస్తూ తన ఇద్దరి స్నేహితులతో కలిసి హత్య చేశాడు. తల్లిదండ్రులతో కలిసి పొలం పనులు చేసుకుంటున్న యువతిపై కొడవలితో నరికి చంపేశారు. తల్లిదండ్రులను వ్యతిరేకించి తాను వ్యవహరించలేనడంతో ఆగ్రహంతో చరణ్ అనే యువకుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇతడికి సహకరించిన రసూల్, నరసింహలు జైలు పాలయ్యారు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఆ యువతి నిండు ప్రాణాలు కోల్పోయింది.

పులివెందులలో చిన్నారిపై అత్యాచారం

ముక్కుపచ్చలారని ఓ బాలికపై ఓ బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలో చోటుచేసుకుంది. ఓ దంపతులు చిన్నపాటి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి చెందిన మేక పిల్ల చనిపోయింది. కళేబరాన్ని పారవేయడానికి వీరి కుమార్తె ఊరిబయట ఉన్న కంప చెట్ల వైపు వెళ్లింది. ఈ సమయంలో బాలికను అనుసరించిన ఓ బాలుడు (16) కళేబరాన్ని ఇక్కడ పడేస్తే దుర్వాసన వస్తుందని, ఇంకొంచెం దూరం వెళ్లి పడేయాలని చెప్పి మరింత దూరం తీసుకెళ్లాడు. అక్కడ బాలిక అరవకుండా దుస్తులు ఊడదీసి నోట్లోకి కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆమె అత్త ఘటనాస్థలికి వెళ్లింది. ఆమెను చూసిన నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే ఆమె తన మేనకోడలిని ఇంటికి తీసుకెళ్లింది. అనంతరం బాలిక కడుపునొప్పి తాళలేకపోవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించారు. బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

మదనపల్లెలో ప్రేమ పేరిట దారుణం

మదనపల్లెలో ఓ యువతిని ప్రేమ పేరుతో కిరాతకంగా హత్య చేశారు. ముగ్గురు యువకులు కలిసి యువతిని నమ్మించి చీకటి ప్రాంతానికి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టారు. ముగ్గురు నిందితుల్లో ఒకరు పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి చివరకు ప్రాణాలు తీసేశారు. ఎందుకు చంపారనే విషయం బయటకు రాకుండానే దారుణం కాలగర్భంలో కలిసిపోయింది.

ఘనంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు : ఎస్పీ



విద్యాసాగర్ నాయుడు, ఎస్పీ

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఎస్పీ వి. విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను గుర్తుచేసుకోవడంతో పాటు సమాజంలో కీలకమైన పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ముఖ్య లక్ష్యమన్నారు. జిల్లాలో ఈ నెల 21న పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించాలన్నారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

ములకలచెరువు ఆసుపత్రికి స్కానింగ్ యంత్రం



గర్భిణికి స్కానింగ్ చేస్తున్న వైద్యురాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే: గర్భవతులు స్కానింగ్‌కు మదనపల్లె వెళ్లే ఇబ్బంది లేకుండా ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో యంత్రం ఏర్పాటు చేశారు. శనివారం గర్భవతులకు ప్రతి నెలా పీఎంఎస్ఎంఏలో భాగంగా స్కానింగ్ చేసి తల్లీ బిడ్డల ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి మదనపల్లె వెళ్లాల్సి వచ్చేది. ములకలచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయడంతో ఆరుగురికి స్కానింగ్ నిర్వహించారు. నెలలో ఒక్కరోజు డాక్టర్ హసీన పర్వీన్ గైనకాలజిస్ట్, డాక్టర్ జాహ్నవిరెడ్డిల ఆధ్వర్యంలో ఈ స్కానింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

23న జడ్పీ సర్వసభ్య సమావేశం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరంలోని జిల్లాపరిషత్తు కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈవో చిలమకూరు ఓబులమ్మ తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని జడ్పీటీసీసభ్యులు, ఎంపీపీలు హాజరుకావాలని కోరారు. సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు పొడిగింపు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు 25 వరకు పొడిగించినట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎం.సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం పది, ఇంటర్ స్పాట్ అడ్మిషన్ల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేసుకోవచ్చునన్నారు. వివరాల కోసం 8121852786కు సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

రాయచోటి, న్యూస్‌టుడే: పురపాలక పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని, అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ డిమాండు చేశారు. రాయచోటిలోని డీఈవో కార్యాలయం ఎదుట శనివారం సంఘ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి నిరసన తెలిపారు. అన్ని మెనేజ్‌మెంట్ పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయని, పుర పాఠశాలల్లో మాత్రం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎం, అర్బన్ ఎంఈవో ఉద్యోగోన్నతులు కల్పించాలని వారు కోరారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, బదిలీలు వెంటనే చేపట్టాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండు చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 24న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, హేమలత, కోశాధికారి చంద్రశేఖర్, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణ, వెంకట రమణ, దావుద్దీన్, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీళ్లు!



పీలేరు పట్టణం తిరుపతి మార్గం దిగువ కాలనీలో మూడు ప్లాట్లలో నిలిచిన వర్షపు నీరు

గత నాలుగు రోజులుగా పీలేరులో కురిసిన వర్షాలకు తిరుపతి మార్గంలోని జగనన్న కాలనీల్లో నీరు నిలిచి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీలో 600 మందికి పట్టాలు ఇచ్చారు. ఇప్పటి వరకు నాలుగేళ్లు అయినా మౌలిక వసతులు కల్పించలేదు. ప్రధానంగా కాలనీ మొదటి వీధి దారిలో కూడా కొద్దిపాటి వర్షానికి నీరు నిలిచిపోతుంది. దిగువన ఉన్న నాలుగు ప్లాట్లలో కొద్దిపాటి వర్షానికి నీళ్లు నిలిచి చెరువులా కనిపిస్తోంది. కాలనీ మొత్తం వీధుల్లో దారులు కూడా అధ్వానంగా ఉండడంతో లబ్ధిదారులు 25 శాతం మంది కూడా నిర్మాణాలు పూర్తి చేయలేదు. వీధుల్లో రోడ్లు వేయిస్తే నిర్మాణాలు పూర్తి చేసేందుకు సౌకర్యంగా ఉంటుందని లబ్ధిదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పీలేరు**



పీలేరు పట్టణం తిరుపతి మార్గంలోని కాలనీ వీధిలో నిలిచిన నీళ్లతో అవస్థలు

కరకట్టలు మాయం... కర్షకుల్లో భయం!

చెయ్యేరు నదీతీర గ్రామాల్లోని పంటపొలాలకు ముంపుభయం

ఎన్డీయే ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్న రైతులు



వరదల ధాటికి మందపల్లి వద్ద కొట్టుకుపోయిన చెయ్యేరు నది కరకట్టలు

- న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

చెయ్యేరు నదీ పరివాహక ప్రాంతం వెంబడి ఉన్న మందపల్లి, పులపుత్తూరు, శేషమాంబపురం, తొగురుపేట, నాగిరెడ్డిపల్లి, గొల్లపల్లి, గుండ్లూరు, పాపరాజుపల్లికి చెందిన గ్రామపంచాయతీల్లోకి వరదనీరు చొరబడ కుండా రక్షణగా నదికి కరకట్టలు నిర్మించారు. 2021, నవంబరు 19న అన్నమయ్య జలాశయం మట్టికట్ట తెగిపోవడంతో దాదాపు ఏడు కిలోమీటర్ల మేర కరకట్టలు తెగిపోవడంతో నదీ పరివాహక గ్రామాల్లోని పంటపొలాలపై విరుచుకుపడడంతో మూడేళ్లపాటు సాగుకు పనికిరాకుండాపోయాయి. వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేశాయి. వీటిపై గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొంతమంది రైతులు తమ పంట పొలాల్లోని ఇసుకను తొలగించుకునేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి తిరిగి వ్యవసాయభూములుగా మార్చుకున్నారు. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు నెలలు పూర్తికాకముందే చెయ్యేరు నదీ పరివాహక గ్రామాల్లోకి వరద నీరు రాకుండా కరకట్టలు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నీటి మీద రాతలుగా మారాయి. వీటి నిర్మాణం కోసం ఒక్క రూపాయి విదిల్చిన పాపాన పోలేదు. ఎన్డీయే ప్రభుత్వం నదీ పరివాహక గ్రామాలకు కరకట్టలు నిర్మించి తమను ఆదుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రైతుల్లో ముంపు కలవరం

వరద బాధిత గ్రామాలైన మందపల్లిలో 400, పులపుత్తూరులో 200, శేషమాంబపురంలో 350, గుండ్లూరులో 400, తొగురుపేటలో 50 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెయ్యేరు నదిలో వరదనీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. నదిలో నీటి ప్రవాహం పెరిగితే కరకట్టల్లేని కారణంగా పంటలు ముంపునకు గురవుతాయని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు మూడేళ్ల అనంతరం పంటలు సాగు చేసుకుంటే వరదల భయం వెంటాడుతోందని వారంతా వాపోతున్నారు.

వరదలొస్తే పంటలు మునగడం ఖాయం



కరకట్టలు నిర్మించకపోవడంతో చెయ్యేరు నదికి వరదలొస్తే మా పంటపొలాలు ముంపునకు గురవ్వడం ఖాయం. దీంతో గతంలో జరిగిన నష్టం కంటే అపార నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మా గ్రామం వద్ద నదికి కరకట్టలు నిర్మించి ఆదుకోవాలి. **- పగడాల భాస్కర్, మందపల్లి**

కరకట్టలు నిర్మించాలి



చెయ్యేరు నదికి కరకట్టలు నిర్మించాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేకపోయింది. కరకట్టల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నెలరోజుల కిందట ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేయడంతో గ్రామంలో రీసర్వే చేపట్టారు. ఎన్డీయే ప్రభుత్వం చొరవ తీసుకుని కరకట్టల నిర్మాణం చేపట్టాలి.

- కొండగారి శ్రీనివాసులు, ఎగువ మందపల్లి

రూ.20 కోట్లు అవసరం

కరకట్టల నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వంలో రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు కేటాయించకపోవడంతో పనులు జరగలేదు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులు చేయిస్తాం.

- వెంకట్రామయ్య, ఈఈ, నీటిపారుదలశాఖ, కడప

క్రమబద్ధీకరించాలని ఒప్పంద ఉద్యోగుల ఆందోళన



పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పీవీసీ జూనియర్ కళాశాలల్లో ఒప్పంద పద్ధతిపై పనిచేస్తున్న అధ్యాపకులు రాష్ట్ర ఒప్పంద అధ్యాపకుల సంఘం పిలుపు మేరకు పసుపు రిబ్బన్లు ధరించి శనివారం విధులకు హాజరై తమ విధులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 24 ఏళ్లుగా ప్రభుత్వ కళాశాలల్లో ఒప్పంద పద్ధతులపై విధులు నిర్వర్తిస్తున్నామని, ఎన్డీయే ప్రభుత్వం తమ సేవలను గుర్తించి విధులను క్రమబద్ధీకరించాలని వారు అభ్యర్థించారు. గత ప్రభుత్వం క్రమబద్ధీకరణకు వివిధ కమిటీలను వేసి కాలయాపన చేసి చివరకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జీవో 114 ఇచ్చి ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న సాకుతో తమకు ఆర్డర్ కాపీ ఇవ్వకుండా తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం తమ విధులను క్రమబద్ధీకరించాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఒప్పంద అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనను వేగవంతం చేయండి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ఫ్రీహోల్డ్ భూముల పునః పరిశీలనను వేగవంతం చేయాలని హంద్రీ-నీవా ప్రాజెక్టు భూసేకరణ విభాగం ఉప కలెక్టర్ రాఘవేంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం బి.కొత్తకోట మండల రెవెన్యూ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన, దస్త్రాల తయారీ, రికార్డుల నమోదులపై అధికారులు, వీఆర్వోలతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. గ్రామాల వారీగా పురోగతిని పరిశీలించి వివిధ సూచనలు చేశారు. స్థానిక తహసీల్దారు మహమ్మద్ అన్సారీలతో పాటు అధికారులు, సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

నిర్మించిన ఏడాదికే!

జిల్లా కేంద్రం రాయచోటిలో కూలిపోతున్న మురుగు కాలువలు

కడప-బెంగళూరు జాతీయ రహదారి పనుల్లో కొరవడిన నాణ్యత



సుద్దలోళ్లపల్లి రోడ్డు సమీపంలో కూలిపోయిన మురుగు కాలువ



మదనపల్లె రోడ్డులో ఇలా...

- న్యూస్‌టుడే, రాయచోటి

పట్టణ ప్రాంతాల్లో ఇరుకు రహదారుల విస్తరణకు గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన పనుల్లో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణం మీదుగా కడప-బెంగళూరు జాతీయ రహదారి వెళుతుంది. నాలుగేళ్ల కిందట రహదారి విస్తరణ పనులు చేపట్టారు. విస్తరణ కొలతలు తగ్గించి రహదారిని నిర్మించారు. ఇదే సమయంలో రహదారికిరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. వీటిని నాసిరకంగా చేయడంతో నిర్మించిన ఏడాదిలోపే చాలా ప్రదేశాల్లో కూలిపోతున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు పట్టణ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

కాలువల మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో కొన్నిచోట్ల కూలిపోయాయి. వీటిని గుర్తించి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. విస్తరణ పనులు చేసిన గుత్తేదారులు వెళ్లిపోవడంతో మరమ్మతు పనులు చేపట్టడంలో ఆలస్యమైంది. **- రఘునాథబాబు, ఏఈ, ఎన్‌హెచ్‌ఏఐ**

రూ.200 కోట్ల పనుల్లో డొల్లతనం

కడప-బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనులకు 2016-18 మధ్యకాలంలో రూ.200 కోట్లు మంజూరయ్యాయి. అంగళ్లు నుంచి రాయచోటి వరకు విస్తరణ పనులు చేపట్టారు. టెండరు దక్కించుకున్న గుత్తేదారు తొలుత పనులు ప్రారంభించడంలో ఆలస్యం చేస్తూ వచ్చారు. 2019లో వైకాపా ప్రభుత్వం రాగానే రాయచోటి పట్టణ పరిధిలోని రహదారి విస్తరణపనులు చేపట్టారు. రింగ్‌రోడ్డు నుంచి పట్టణంలోని శివాలయం కూడలిలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి వరకు విస్తరణ పనులు చేశారు. రహదారికిరువైపులా తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు స్తంభాలు సద్దుబాటు చేసినా మురుగు కాలువలు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చారు. పనులు పూర్తయిన ఏడాది లోపే కాలువలు ఎక్కడ పడితే అక్కడ కూలిపోతున్నాయి. వీటికి మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పట్టణవాసులు వాపోతున్నారు. మరికొన్ని చోట్ల కాలువల నిర్మాణపనులు అసంపూర్తిగా వదిలేశారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు మీదుగా తిరుపతి నుంచి గుంతకల్లుకు వెళ్లే పలు రైళ్లు శనివారం ఆలస్యంగా నడిచాయి. తిరుపతి నుంచి గుంతకల్లుకు వెళ్లే ప్యాసింజరు రైలు శుక్రవారం అర్ధరాత్రి 1.49 గంటలకు రావాల్సి ఉండగా తెల్లవారుజామున 3.24 గంటలకు వచ్చింది. తిరుపతి నుంచి గుంతకల్లుకు ఉదయం పూట వెళ్లే ప్యాసింజరు రైలు ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా, మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. నరసాపురం నుంచి ధర్మవరం నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా, 8.37 గంటలకు వచ్చింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి నడిచే సెవెన్‌హిల్స్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు అర్ధరాత్రి 2.49 గంటలకు రావాల్సి ఉండగా, తెల్లవారుజామున 3.41 గంటలకు వచ్చింది. రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కుయ్ కుయ్... వెళ్లేదెలాగోయ్!

కలికిరిలోని ఐటీబీపీ (ఇండో టిబెటిన్ బార్డర్ పోలీసు) అంబులెన్స్ శనివారం పీలేరు పట్టణం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. వాహనం పీలేరుకు వచ్చి కలికిరి వెళ్లేందుకు సాయిబాబా ఆలయం వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు రాగా వంతెన ఎదురుగా ఎత్తైన వాహనాలు వెళ్లకుండా రైల్వే వారు ఇనుప రక్షణ కవచం ఏర్పాటు చేశారు. అంబులెన్స్ డ్రైవర్ దాన్ని గమనించకుండా దూరడంతో ముందు భాగం ఇరుక్కుపోయింది. దీంతో ఈ మార్గంలో కొంత సమయం ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. వాహనంలోని సిబ్బంది పైకి ఎక్కి సర్దుబాటు చేయడంతో చివరకు అక్కడి నుంచి వెళ్లడంతో సమస్య తీరింది. - న్యూస్‌టుడే, పీలేరు



పీలేరు రైల్వేవంతెన వద్ద ఇరుక్కుపోయిన అంబులెన్స్

దిక్సూచి కరదీపిక ఆవిష్కరణ

మదనపల్లె విద్య: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర రిసోర్స్ బృందం వారిచే రూపొందించిన దిక్సూచి కరదీపికను శనివారం మదనపల్లె డీవైఈవో శ్రీరామ పురుషోత్తం చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ఈ దిక్సూచి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏగ్రేడ్ పిల్లల నుంచి ప్రతి విద్యార్థి కరదీపికను ఉపయోగించుకోవచ్చునన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భాస్కరన్, కోశాధికారి పి.ఎ.ఎస్.శాస్త్రి, జాయింట్ సెక్రెటరీ జగన్‌రెడ్డి, గౌరవ సలహాదారుడు భాస్కర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దారులు అధ్వానం... కాలువలు శూన్యం

గుర్రంకొండ మేజర్ పంచాయతీ దుస్థితిదీ

గుర్రంకొండ, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉండే గుర్రంకొండ మేజర్ పంచాయతీలో సమస్యలు కోకొల్లలు. ఓ వైపు మురుగు కంపు కొడుతోంటే, మరో వైపు నడవలేని రహదారులపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న పంచాయతీలో సమస్యలు తిష్టవేశాయి. కనీస వసతులు లేక ప్రజలు అల్లాడుతున్నారు. మేజర్ పంచాయతీ వల్ల పన్నుల మోత తప్ప అభివృద్ధి శూన్యమని ప్రజలు వాపోతున్నారు.

★ పంచాయతీకి ఆదాయం పెద్ద ఎత్తున వస్తున్నా, అందుకు తగ్గ అభివృద్ధి కనపడలేదన్న విమర్శలున్నాయి. పంచాయతీ స్థలంలో 100 బంకుల్లో అంగళ్లు నడుస్తున్నాయి. ఒక్కో బంకు నుంచి ప్రైవేటు వ్యక్తులు రూ.10 వేలు బాడుగలు వసూలు చేస్తున్నారు. పంచాయతీ కనీసం రూ.2 వేలు వసూలు చేసినా ప్రతి నెలా రూ.2 లక్షల ఆదాయం సమకూరుతోంది. వీటి నుంచి ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం అందుతోంది. పట్టణంలో మాత్రమే 4,500 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటి నుంచి ఏడాదికి వెయ్యి ఆదాయం పంచాయతీకి అందినా రూ. 45 లక్షల ఆదాయం వస్తుంది. ప్రతి కొళాయికీ ఏటా రూ.300లు పన్ను వసూలు చేస్తున్నారు. అధికారిక కనెక్షన్లు 3 వేలు దాకా ఉన్నాయి. వీటి నుంచి రూ.9 లక్షల ఆదాయం అందుతోందని అంచనా. ఏటా వారపు సంత, బస్టాండు గేటు వెరసి రూ. 15 లక్షల ఆదాయం వస్తోంది. స్థిరాస్థి వ్యాపారాలు, ఇంటి నిర్మాణాలు జోరుగా సాగుతున్నందున లక్షల్లో ఆదాయం పంచాయతీ ఖాతాలో చేరుతోంది. ఇక ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు వెరసి ఏడాదికి కోటికి పైగా ఆదాయం పంచాయతీ ఖాతాకు చేరుతోంది.

★ 14 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కాలనీలో నేటికీ మురుగు కాలువలు లేక రహదారులపైనే మురుగు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలోని మొదటి మూడు వీధులు అధ్వానంగా ఉండగా గుంతల దారులు కనీసం నడవడానికి కూడా ఇబ్బందికరమైన దుస్థితిలో ఉన్నాయి. రహదారులపై బండరాళ్లు, కంకర ఎక్కడపడితే అక్కడే వదిలేశారు. చెత్తా చెదారాలు, కంపచెట్లు అలుముకున్నాయి. మురుగునీరు ప్రవహించడానికి కాలువలు లేక పోవడంతో ఎవరి ఇంటి వద్ద వారే గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. భారీగా ధరలు పెరగడంతో నేతలకు ఖాళీ స్థలాల ఆక్రమణల పైన ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టణం మధ్యలో ఉన్న మురుగు కాలువ



అధ్వానంగా ఉన్న జగనన్న కాలనీ రహదారి

★ జగనన్న కాలనీలో రోడ్లు, తాగునీటి గొట్టాలు ఏర్పాటు చేయలేదు. గుట్టలు, బండలు, గుంతలు ఉన్న ఎత్తుపల్లాలపై స్థలాలు కేటాయించడంతో ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. విద్యుత్తు సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది.

★ పాత దళితవాడలో ఎప్పుడో తెదేపా హయాంలో ఇచ్చిన ఇళ్లల్లో ఉన్న వారికి కూడా సదుపాయాలు మెరుగు పడలేదు. గోతుల దారుల్లో రాకపోకలకు దళితులు అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువలు అంతంత మాత్రమే. కనీస వసతులు కరువయ్యాయని వారు వాపోతున్నారు.

★ కొత్తపేట, గంజికుంట, తాండీవీధి, బలిజగడ్డల్లో కాలువలు లేక మురుగు రోడ్లపైకి చేరుతోంది. ఎంపీడీవో కార్యాలయం పక్కనున్న పెద్ద కాలువ కంపుకొడుతున్నా శుభ్రం చేయలేని దుస్థితిలో పంచాయతీ ఉందంటే అతిశయోక్తి కాదు. దశాబ్దాలు గడుస్తున్నా గంజి కాలువ నిర్మాణానికి నోచుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకులు చొరవ తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సమస్యలున్న మాట వాస్తవమే, తగినన్ని నిధులు వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. కొన్ని రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఆయా పనులు చేపట్టనున్నాం. పనులు చేపట్టి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

- విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి, గుర్రంకొండ

వైకాపా పాలనలో రూ.వెయ్యి కోట్ల మేర భూఆక్రమణలు

రామసముద్రం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో మదనపల్లె పట్టణంలో రూ.1000 కోట్ల మేర భూఆక్రమణలు పాల్పడ్డారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆరోపించారు. రామసముద్రం మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో మంజూరైన 47 సీసీ రహదారుల పనులకు రూ.2 కోట్ల వ్యయంతో శనివారం 'పల్లె పండగ' కార్యక్రమంలో ఆయన భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నియోజకవర్గంలో 162 పనులకు రూ.6 కోట్ల వ్యయంలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్నట్లు వివరించారు. అనంతరం చెంబకూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... వైకాపా పాలనలో కేవలం భూదోపిడీ మాత్రమే జరిగిందని విమర్శించారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలను పీడించి వారి భూములను దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత తెదేపా పాలనలో అభివృద్ధి, పేదల సంక్షేమం జరుగుతోందని కితాబునిచ్చారు. వైకాపా పాలనలో సీఎంను కలిసేందుకు ఎమ్మెల్యేలకే అపాయింట్‌మెంట్ దొరికేది కాదన్నారు. అయితే ప్రస్తుత పాలనలో సీఎంను కలవడానికి ప్రతి ఎమ్మెల్యేకు అవకాశం ఇస్తున్నారన్నారన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడంతో గుత్తేదారులు కమీషన్లకు కక్కుర్తి పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని కోరారు. నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీటీఎం ఈశ్వర చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ శివప్రసాద్, ఎంపీడీవో భానుప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు, తెదేపా సీనియర్ నాయకులు కృష్ణమరాజు యాదవ్, శివకుమార్, తిప్పన్న, మునివెంకటస్వామి, గౌనివారిపల్లె రెడ్డెప్పరెడ్డి, పెద్దిరెడ్డి, సీఆర్.నారాయణరెడ్డి, కిట్ట, రూపేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శివ, కృష్ణప్ప, రాజేష్‌స్వామి, రామూర్తి, వెంకటేష్, తలారిశ్రీనివాసులు, ఇంజం వెంకటరమణ, చలపతినాయుడు, వెంకటప్ప, వేణుగోపాల్, శివకుమార్‌రెడ్డి, చిన్నస్వామి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

చింతపర్తి (వాల్మీకిపురం), న్యూస్‌టుడే : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుతో పాటు సీజనల్ వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆసుపత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్‌బాబుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో దస్త్రాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వర్షాకాలం ఉన్నందున వైద్య సిబ్బంది బాధ్యతతో పని చేయాలని, ప్రజలకు సరైన అవగాహన కల్పించి వ్యాధుల నివారణకు పని చేయాలన్నారు. పాము, కుక్కకాటు మందులతో పాటు అత్యవసర మందులను అందుబాటులో పెట్టుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, వైద్య సిబ్బంది మహమ్మద్ రఫి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న కొండయ్య

హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ: చెర్లోపల్లెలో వెలిసిన సంతాన ప్రదాత శ్రీరెడ్డెమ్మ దేవత ఆలయ హుండీని శనివారం లెక్కించగా రూ.7 లక్షలు నగదు, 16 గ్రాముల బంగారు, 169 గ్రాముల వెండి ఉన్నట్లు ఈవో మంజుల చెప్పారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం బ్యాంకులో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ తనిఖీ అధికారి శశికుమార్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుబయ్ సదస్సుకు ములకలచెరువు విద్యార్థి

ములకలచెరువు, న్యూస్‌టుడే: ఐఈఈఈ ఇంటర్నేషనల్ బ్రాంచి ఆధ్వర్యంలో దుబయిలో ఈ నెల 16న జరిగిన కార్యశాలలో పాల్గొనే అరుదైన అవకాశం ములకలచెరువు విద్యార్థికి దక్కింది. ములకలచెరువు వినాయకనగర్‌కు చెందిన శ్రీనివాసులుకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవాడు కిరణ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా రెండో కుమారుడు మోక్షిత్ బీటెక్ (ఈసీఈ) 3వ సంవత్సరం అంగళ్లు సమీపంలోని మిట్స్ కళాశాలలో చదువుతున్నాడు. ఐఈఈఈ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్) అంతర్జాతీయ వేదిక ఆధ్వర్యంలో దుబయ్‌లోని ఓ హోటల్‌లో సదస్సు నిర్వహించారు. 10 దేశాల నుంచి విద్యార్థులు హాజరు కాగా రాష్ట్రం నుంచి మోక్షిత్‌కు అవకాశం వచ్చింది. మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్, హెచ్‌వోడీ రాజశేఖర్ ఆదేశాల మేరకు మోక్షిత్ ఈ సెమినార్‌లో కమ్యూనికేషన్‌పై వివరించారు. 3జీ నుంచి 5జీ ఇంటర్నెట్‌కు జరిగిన మార్పు 6జీ రాకపై ప్రసంగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల యాజమాన్యం, విద్యార్థులు అభినందించారు.

ఎరక్కపోయి వచ్చి... ఇరుక్కుపోయి!

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట పట్టణంలోని జ్యోతి బస్టాండులో భారీ వాహనాలు ఇరుక్కుపోయి ట్రాఫిక్ స్తంభించిపోవడం నిత్యకృత్యమైంది. శనివారం ఉదయం పీటీఎం వైపు నుంచి వచ్చిన సిమెంటు లారీ బెంగళూరు రోడ్డులోకి మలుపు తిరుగుతూ ఆగిపోయింది. ఈ కూడలిలో ఉన్న గుంతల్లో లారీ చక్రాలు ఇరుక్కుపోవడంతో వాహనం ముందుకు వెళ్లలేక... వెనక్కి రాలేక నడిరోడ్డుపైనే ఆగిపోయింది. ఈ కారణంగా దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. గుంతలు పడిన రహదారికి మరమ్మతులు చేయించడానికి రహదారులు, భవనాలశాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని స్థానికులు సూచిస్తున్నారు. స్థానిక జ్యోతి బస్టాండు కూడలిలో తరచుగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై పోలీసులు దృష్టిని కేంద్రీకరించాలని కోరుతున్నారు.



జ్యోతి బస్టాండు మలుపులో ఇరుక్కుపోయిన భారీ వాహనం

రాజనాల బండ మహిమతో చోరీ నగలు లభ్యం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహస్వాముల మహిమతోనే నాలుగు నెలల కిందట చోరీ అయిన 62 గ్రాముల బంగారు నగలు, రూ.25 వేల నగదు లభ్యమైందని బాధితుడు సి.అజయ్‌బాబు శనివారం తెలిపారు. వాల్మీకిపురానికి సమీపంలోని చెరుకువారిపల్లెకు చెందిన ఆయన ఇంట్లో నాలుగు నెలల కిందట చోరీ జరిగింది. 62 గ్రాముల బంగారం, రూ.25 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో గ్రామంలోని అనుమానితులతో చౌడేపల్లె మండలంలోని రాజనాల బండకు తీసుకొచ్చి సత్యప్రమాణం చేయించారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు కిందట బాధితుడి ఇంటి ఆవరణలో చోరీ చేసిన నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయని బాధితుడు తెలిపారు. శనివారం ఆలయానికి నగలు, నగదు, తీసుకొచ్చి స్వామివారి పాదాలు చెంత పెట్టి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కూలిన ఆలేటిపల్లె పాఠశాల గోడ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఆలేటిపల్లె ఎంపీపీ పాఠశాల భవనం గోడ పాక్షికంగా కూలిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు దెబ్బతిన్న ఈ భవనంలో కొంత భాగం శుక్రవారం రాత్రి పడిపోయింది. దాదాపు 40 ఏళ్ల క్రితం కట్టిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తరగతి గదులను పక్కనే ఉన్న మరో భవనంలో నిర్వహిస్తున్నారు. కూలిపోయిన ఈ పాఠశాల భవనాన్ని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. పాతబడ్డ భవనం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉన్నందువల్ల ఈ ప్రాంగణానికి విద్యార్థులు, గ్రామస్థులు వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. పాత భవనాన్ని పూర్తిగా కూల్చివేసి కొత్తభవనం నిర్మాణానికి ప్రతిపాదనల్ని పంపాలని సూచించారు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను జయచంద్రారెడ్డి చరవాణి ద్వారా కోరారు. స్థానిక ఎంఈవో-2 భీమేశ్వరాచారి మాట్లాడుతూ మండలంలోని ఆలేటిపల్లెలో కొత్తభవనం, రెడ్డివారిపల్లె, కొత్త వుడియం, శెట్టిపల్లె పాఠశాల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపుతున్నట్లు పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనంలోకి ఎవరూ వెళ్లకుండా బోర్డును ఏర్పాటు చేయించినట్లు వివరించారు. స్థానిక తహసీల్దారు మహమ్మద్ అన్సారీ, తెదేపా మండల నాయకుడు గంజి మోహన్‌తో పాటు పలువురు ఇందులో పాల్గొన్నారు.



బి.కొత్తకోట శివార్లలోని ఆలేటిపల్లె పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న తెదేపానేత జయచంద్రారెడ్డి

హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం: డీఎస్పీ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కురబలకోట మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన వేంపల్లె ఖాదర్‌బాషా (27) హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. కురబలకోట సమీపంలోని డంపింగ్‌యార్డ్ సమీపంలో ఖాదర్‌బాషాను గొంతు కోసి గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసింది. దీనిపై రూరల్ సర్కిల్ సీఐ రమేష్, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్‌తో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం హత్య జరిగిన ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. పోలీసు జాగిలం హత్య జరిగిన ప్రదేశానికి కొంతదూరంలో మద్యం తాగిన ఆనవాళ్లు ఉండటంతో అక్కడికి ఆగింది. అక్కడి నుంచి ప్రధాన రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ వరకు వెళ్లింది. వివాహేతర సంబంధమే హత్యకు దారితీసి ఉండవచ్చని ప్రాథమికంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఖాదర్‌బాషా ఎవరితో సన్నిహితంగా ఉంటున్నాడు.. హత్య జరిగిన సమయంలో సమీపంలో ఎవరెవరున్నారు? అన్న వివరాలను సాంకేతికంగా విచారణ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

గురుకులాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి: జడ్జి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి అబ్రహం అన్నారు. శనివారం చంద్రాకాలనీలో బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న సేవలు, వారికున్న సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించి వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి విద్యార్థులకు వండి పెడుతున్న బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు జబ్బులు రాకుండా వైద్యసేవలు అందించాలని ప్రిన్సిపల్ వసుంధరతో పాటు ఉపాధ్యాయులకు సూచించారు. గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రిన్సిపల్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి అబ్రహం

మానవ అక్రమ రవాణా అరికట్టడం అందరి బాధ్యత

మదనపల్లెలో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీ

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మానవ అక్రమ రవాణా అరికట్టడం మన అందరి బాధ్యతని మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శనివారం గ్రామజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా అరికట్టాలని ఏ-21, ద మూమెంట్ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... చిన్నపిల్లలు, మహిళల అక్రమ రవాణా జరుగుతున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే 1098, 181, 100కు సమాచారం అందించాలన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా, గ్రామజ్యోతి సొసైటీ వ్యవస్థాపకురాలు సుభద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, వివిధ స్వచ్ఛంద సంస్థల వ్యవస్థాపకులు పాల్గొన్నారు. సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్ఎస్ సంస్థ వ్యవస్థాపకుడు బొజ్జప్ప ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమం నిర్వహించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్, సీఐ చాంద్‌బాషా

వాలంటీర్ల ఆందోళనకు మద్దతు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లు చేపట్టనున్న ఆందోళనకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు కూటమి నేతలు రాష్ట్రంలోని వాలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలు జీతం ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వాలంటీర్ల వేతన బకాయిలు, కొనసాగింపుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందించారని, వాలంటీర్ల చేత బలవంతంగా రాజీనామాలు చేయించిన వాళ్లపై కఠిన చర్యలు తీసుకుని తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద వాలంటీర్లు చేపట్టనున్న ఆందోళనకు ఏఐటీయూసీ సంఘీబావం తెలుపుతున్నామన్నారు. సంఘం మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మురళి, వెంకటరమణ, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

కాపులకు అండగా సహాయ కేంద్రం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : కాపుల సమస్యలు పరిష్కరించేందుకు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాలయ సొసైటీ వ్యవస్థాపకుడు టీఎస్ నరసయ్య అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల తాము బలిజ వివాహ పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చాలా మంది బలిజ సామాజిక వర్గీయులు విద్య, వైద్యం, ఉద్యోగానికి సంబంధించి పలు సమస్యలు తీసుకొచ్చారన్నారు. రాయలసీమను యూనిట్‌గా చేసుకుని మదనపల్లెలో పదెకరాల్లో హబ్ ఏర్పాటు చేసి మదనపల్లెలోనే కాపులకు ఉద్యోగ, విద్య, వైద్యం అందించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు కాపుల్లోని అన్ని కుల సంఘాల నాయకులు, సభ్యులు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రాయలసీమకు ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాలయ సభ్యులు పవన్‌తేజ, రాష్ట్ర కాపునాడు నాయకుడు ఆంజనేయకుమార్, రాయల్ యూత్ అధ్యక్షుడు రేగడి ప్రసాద్, స్వరూప, చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చెరువు కట్టపై స్వచ్ఛ సేవలు



కట్టపై పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : కోమటివాని చెరువు కట్టను పురపాలక కార్మికులు శుభ్రం చేశారు. శనివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బయ్య కార్మికులతో పారిశుద్ధ్య పనులకు ఉపక్రమించారు. పిచ్చి మొక్కలను తొలగించి, కట్టపై అడ్డంగా ఉన్న మట్టి వ్యర్థాలను పొక్లెయిన్ ద్వారా తొలగించారు. చెరువు పక్కనే జడ్పీ బాలుర పాఠశాల ఉండటంతో నిత్యం ఈ ప్రాంతంలో విద్యార్థులు తిరుగుతుంటారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చెరువు కట్టను శుభ్రం చేయించామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

హరిత మదనపల్లె లక్ష్యం

మదనపల్లె పట్టణం: పట్టణంలో విరివిగా మొక్కలు నాటి హరిత మదనపల్లెగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం శారదానగర్, తాళ్లసుబ్బన్నగారి నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి శనివారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ ప్రమీల, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. మధుబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



శారదానగర్‌లో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

ప్రజావసరం పరిష్కారం

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

● కొత్తిండ్లు పంచాయతీలో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని రంగారెడ్డి కాలనీలో మురుగు కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోయి అధ్వానంగా ఉండటంతో కాలనీవాసులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల 14న 'ఈనాడు'లో ఈ సమస్యపై కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

● కొత్తవారిపల్లె పంచాయతీలో వీధి దీపాలు మరమ్మతులు చేపట్టారు. పంచాయతీలోని నేతాజీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని కాలనీ ప్రజలు 'ఈనాడు' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పంచాయతీ అధికారులకు సమస్యను వివరించి ఈ నెల 14న 'మేమున్నాం... మీతోడుగా' శీర్షికలో ప్రచురితమైంది. దీంతో పంచాయతీ సర్పంచి మహేష్ స్పందించి మరమ్మతులు కార్యక్రమం చేపట్టారు.

● పెద్దచెరువులో చెత్తచెదారం వేయకుండా చర్యలు చేపట్టినట్లు డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. గ్రామీణ మండలం సీటీఎం పెద్దచెరువులో చెత్తచెదారం వేయకుండా కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు, గ్రామీణుల్లో అవగాహన కల్పించి తడి, పొడి చెత్త సేకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు.

● తాళ్లసుబ్బన్న కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని ఈ ప్రాంతంలో చెత్తచెదారం దిబ్బలుగా రోడ్డుపై వేస్తున్నారని స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల 9న 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. ఈ మేరకు పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

● గుడిసెవారిపల్లెలో రోడ్డుపై పంచాయతీ అధికారులు చెత్తదిబ్బల తొలగింపు చర్యలు చేపట్టారు. కొత్తవారిపల్లె పంచాయతీలోని తిరుపతి మార్గంలో చెత్తదిబ్బలు పేరుకుపోయి అధ్వానంగా ఉండటంతో గ్రామస్థులు 'ఈనాడు'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల 8న 'మేమున్నాం... మీకుతోడుగా' శీర్షికలో సమస్య ప్రచురితమైంది. కార్యదర్శి గిరి స్పందించి కార్మికుల చేత పారిశుద్ధ్య పనులు చేయించి సమస్యను పరిష్కరించారు.

● ఇందిరమ్మ కాలనీలో చెత్త చెదారాన్ని కార్మికులు డంపింగ్ యార్డుకు తరలించారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో కాలనీవాసులు 'మేమున్నాం...మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 8న 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. దీనిపై సర్పంచి ఆనంద్‌రెడ్డి స్పందించారు. పంచాయతీ కార్మికుల చేత చెత్త చెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా సంపద కేంద్రాలకు తరలించే చర్యలు చేపట్టారు.

● పుంగనూరు రోడ్డులో పురపాలక సంఘం అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇంటింటా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను కొందరు రోడ్డుపై వేస్తుండటంతో దుర్వాసన వస్తుందని కల్యాణ మండపం ప్రాంతానికి చెందినవారు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ సమస్యపై ఈ నెల 8న 'ఈనాడు'లో ప్రచురితమైంది. కమిషనర్ ప్రమీల స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేయించారు.

● తాగునీటి సమస్య పరిష్కరించిన పంచాయతీ అధికారులు మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీలో బోరు మోటారు మరమ్మతులకు గురై నీటి సమస్య తలెత్తడంతో గ్రామస్థులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 4న 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. సర్పంచి శరత్ రెడ్డి స్పందించారు. మరమ్మతులు చేయించి నీటి సరఫరా చేయించడంతో సమస్య పరిష్కారమైంది.

● గ్రామీణ మండలం కొండామర్రిపల్లె పంచాయతీ తట్టివారిపల్లె చెరువులో చెత్తచెదారాన్ని శుభ్రం చేశారు. స్థానికంగా కొందరు చెరువులో వ్యర్థాలు వేయడంతో గ్రామీణులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో ఈ నెల 8న 'జల వనరులు కలుషితం... పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఎల్‌పీవో నాగరాజ పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించారు.

- న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

● పీలేరు శివారు యర్రమరెడ్డిగుట్ట ప్రాంతం నుంచి వెళ్లే మురుగు రోడ్డుపై పారకుండా రోడ్డు అంచున జేసీబీతో తాత్కాలిక కాలువ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో మురుగు పారుదల వ్యవస్థ లేకపోవడంతో మేకలవానికాలువ మార్గంలో రోడ్డుపై ప్రవహిస్తుండేది. మురుగులోనే రాకపోకలు సాగిస్తుండేవారు. ఈ నెల 7న 'మురుగులోనే నడక' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈవో గురుమోహన్ సమస్యకు తాత్కాలిక పనులు చేయించారు. ఇక్కడ శాశ్వత కాలువ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపుతామని ఈవో అన్నారు.

- న్యూస్‌టుడే, పీలేరు

● పీలేరు పట్టణం గాంధీ వీధిలోని చేతిబోరుకు శనివారం బోరు మెకానిక్ శ్రీనివాసులు మరమ్మతులు చేశారు. శుక్రవారం బోరు పనిచేయడం లేదని స్థానికుడు జవహర్‌బాషా 'మేమున్నాం... మీకు తోడుగాకు' సమాచారం అందించడంతో ఈనాడులో సమస్య ప్రచురింతమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో శివశంకర్ బోరును మరమ్మతులు చేయించారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత



అంకిశెట్టిపల్లెలో మొక్కలు నాటుతున్న మదనపల్లె యూత్ కరాటే క్లబ్ మాస్టర్ డాక్టర్ ఏఆర్ సురేష్, విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మదనపల్లె యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు, నెహ్రూ యువకేంద్రం సభ్యుడు డాక్టర్ ఏఆర్ సురేష్ అన్నారు. శనివారం అంకిశెట్టిపల్లె గ్రామంలో మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో మొక్క నాటుదాం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో కరాటే విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరాటే బ్లాక్‌బెల్ట్ విద్యార్థులు మహేశ్వర్, ముహుబుల్ రెహమాన్, కాలేషా మస్తాన్, ఉమ్మర్, లాస్య, తేజిత్, చారుకేష్ రాయల్, ప్రజ్వల్ రాయల్, కార్తికేయ, అబుబకర్, జైత్రమాదవ్, హేమాంశ్, తనుష్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

25న ఆర్టీసీలో లక్కీ డ్రా

మదనపల్లె అర్బన్ : బి.కొత్తకోట మార్గంలో ప్రయాణం చేసిన వారి కోసం ఈ నెల 25న లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని 1వ డిపో డీఎం ఎంవీ రమణారెడ్డి తెలిపారు. అందువల్ల ఆర్టీసీ బస్సులో బి.కొత్తకోట మార్గంలో ప్రయాణించే వారు తమ టికెట్ వెనుక వైపున పేరు, చిరునామా, ఫోన్ నెంబరు వేసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలని సూచించారు. కాగా లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తామని డీఎం తెలిపారు.

రూ.1.20 కోట్లు ఖర్చు... అయినా నిరుపయోగం

సొంత భవనాలకంటే అద్దె గదులే ముద్దు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: అసౌకర్యాల మధ్య అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు సువిశాలమైన ఆవరణలో కొత్తగా సొంత భవనాలను నిర్మించి ప్రారంభించడం సాధారణంగా చూస్తుంటాం. అయితే దీనికి భిన్నంగా బి.కొత్తకోట నగర పంచాయతీలో సొంత భవనాలు కట్టినప్పటికీ వాటిని వినియోగించుకోకుండా అద్దె భవనాల్లోనే గ్రామ సచివాలయాలను కొనసాగిస్తున్నారు. మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా బి.కొత్తకోట స్థాయిని ఏకపక్షంగా పెంచిన వైకాపా ప్రభుత్వం దానికి తగినట్లు సచివాలయ వ్యవస్థలో ఉత్పన్నమయ్యే సాంకేతిక లోపాలను పట్టించుకుండా వదిలేసింది. అందుకే పట్టణంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో రూ.1.20 కోట్లతో కట్టిన భవనాలు నిరుపయోగంగా ఉండగా... గ్రామ సచివాలయాల అద్దెల కోసం ప్రతి నెలా రూ.20 దాకా ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. గ్రామ పంచాయతీగా బి.కొత్తకోట ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఈ పనులు చేపట్టగా వివిధ దశల్లో పూర్తి చేశారు. ఈ మధ్యలో బి.కొత్తకోట నగర పంచాయతీగా మారడంతో ఇప్పుడు పట్టణ ప్రాంతంలో భవన నిర్మాణ పనులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు చెల్లించడంలో సాంకేతిక అవరోధాలు ఎదురవుతున్నాయి. ఇటు నగర పంచాయతీ, అటు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకుండా వదిలేయడం ఈ సమస్యకు ప్రధాన కారణంగా కన్పిస్తోంది.



బీసీ కాలనీలోని అద్దె భవనంలో నడుస్తున్న సచివాలయం



నిరుపయోగంగా మిగిలిన కొత్త సచివాలయ భవనం

ఏం జరిగిందంటే...

రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఐదు గ్రామ సచివాలయాలను బి.కొత్తకోట పంచాయతీలో ఏర్పాటు చేశారు. అప్పట్లో ఐదు సచివాలయ భవనాల నిర్మాణాలను రూ.2 కోట్లతో పూర్తి చేయాలని నిర్ణయించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనులను పంచాయతీరాజ్‌శాఖ ప్రారంభించింది. ఈ పనులు వివిధ దశల్లో ఉండగానే బి.కొత్తకోటను నగర పంచాయతీగా స్థాయిని పెంచినా పనులు కొనసాగించారు. తొలుత ఇందిరమ్మ కాలనీలో సచివాలయ నిర్మాణం పూర్తికాగా దాన్ని ప్రారంభించారు.

● బి.కొత్తకోట బీసీ కాలనీలో రూ.40 లక్షలతో సచివాలయ భవన నిర్మాణ పనులు ఏడాదిక్రితం పూర్తి చేసినా నిరుపయోగంగా వదిలేశారు. ఇదే కాలనీలో ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో సచివాలయాన్ని నడుపుతున్నారు.

● స్థానిక బత్తలాపురం క్రాస్‌లో కొత్త భవనం పనులు ముగిసినా ప్రారంభించకుండా తాళాలు వేశారు. తాకాటంవారిపల్లె రోడ్డులోని అద్దెభవనంలో ఈ సచివాలయాన్ని నడుపుతున్నారు.

● బైపాస్ రోడ్డులో సచివాలయ భవన నిర్మాణ పనులు ముగిశాయి. అయితే ఇదే ప్రాంతంలోని పాత మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనంలో సచివాలయాన్ని నడుపుతున్నారు. కొద్దిపాటి వర్షానికే ఉరుస్తున్న ఈ భవనంలోకి తరచుగా పాములు ప్రవేశిస్తుండటం ఉద్యోగులతో పాటు స్థానికులను భయాందోళనలకు గురి చేస్తోంది. కొత్త భవనంలోకి సచివాలయాన్ని మార్చితే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు సూచిస్తున్నా.. పట్టించుకునే నాథుడు కరవయ్యారు.

● పాశంవీధి పొడిగింపు ప్రాంతంలో సచివాలయ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది. భవన నిర్మాణానికి భూమి అనుకూలంగా లేకపోవడంతో పాటు వివిధ కారణాల వల్ల ఈ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. ప్రస్తుతం పోకనాటివీధిలోని అద్దె భవనంలో ఈ సచివాలయం నడుస్తోంది.

అధికారులేమంటున్నారంటే... : బి.కొత్తకోటలో కొత్త సచివాలయ భవనాలను వీలైనంత త్వరగా ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నామని పంచాయతీరాజ్‌శాఖ డీఈ మునిరాజ కుమార్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. పంచాయతీరాజ్ నుంచి పురపాలకశాఖ పరిధిలోకి బి.కొత్తకోట పరిపాలన మారిన నేపథ్యంలో బిల్లుల చెల్లింపుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడానికి తగు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

భయబడి... పంచాయతీలోకి



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

రామసముద్రం, న్యూస్‌టుడే: శిథిలావస్థలో ఉన్న ఈ పాఠశాల భవనం రామసముద్రం మండలం కమ్మవారిపల్లె గ్రామ పంచాయతీ కేంద్రంలోనిది. 25 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు పాఠశాల భవన పైకప్పుకు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో పైకప్పు పెచ్చులూడి కొన్నేళ్లుగా వర్షానికి కారుతోంది. భవనం గోడలు దెబ్బతిన్నాయి. ప్రత్యామ్నాయ గదుల సౌకర్యం లేకపోవడంతో తరగతుల నిర్వహణ భవనంలోనే చేపట్టాల్సిన పరిస్థితి. పాఠశాలలో 18 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో తరగతుల నిర్వహణకు సాహసించలేక ఉపాధ్యాయుడు పాఠశాల భవనం పక్కనే ఉన్న గ్రామ పంచాయతీ కేంద్రంలో తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో హేమలతను వివరణ కోరగా భవన ప్రమాదకర పరిస్థితిని బట్టి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తరగతుల నిర్వహణ జరుగుతోంది. నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు.

ఒప్పంద అధ్యాపకుల నిరసన

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు శనివారం పసుపు బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఒప్పంద అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డెప్ప, కృష్ణమూర్తి, రామాంజులు, నాగేశ్వరరావు, హరినాయక్, రాజా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వ్యాపారాలు చేసుకోవాలి



దుకాణాల ఏర్పాటుకు భూమిని పరిశీలిస్తున్న తహసీల్దారు మహమ్మద్ అన్సారీ, సీఐ రాజారెడ్డి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: దీపావళి దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకే బాణసంచా విక్రయాల వ్యాపారాన్ని నిర్వహించుకోవాలని బి.కొత్తకోట తహసీల్దారు మహమ్మద్ అన్సారీ, స్థానిక సీఐ రాజారెడ్డి సూచించారు. శనివారం బి.కొత్తకోటలోని పీటీఎం రోడ్డులో జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనున్న ప్రైవేటు వ్యక్తికి చెందిన మైదానాన్ని వారు పరిశీలించారు. బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి ఇక్కడున్న అనుకూలతలను అధ్యయనం చేశారు. ఇదే తరహాలోనే కాండ్లమడుగు, కనిగల తోపుల్లో దుకాణాల కోసం స్థలాలను చూశారు. అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించిన తర్వాత స్థలాలను ఖరారుపై ప్రకటన చేస్తామని తహసీల్దారు తెలిపారు.

మానవ అక్రమ రవాణా అరాచకం

గుర్రంకొండ, న్యూస్‌టుడే : సమాజంలో రోజురోజుకు మానవ అక్రమ రవాణా ఎక్కువగా సాగుతోందని ఇది భవిష్యత్తులో చాలా అరాచకాలకు, అన్యాయానికి దారితీస్తుందని, ఇది ఒక దుర్మార్గపు చర్యని హెచ్‌సీ వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం రిడో సంస్థ, అంతర్జాతీయ ఎన్జీవో ఆస్ట్రేలియ, మూమెంట్ ఇండియాల సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. విద్యార్థులతో కలిసి ర్యాలీ, అవగాహన సదస్సు, గోడపత్రికల ఆవిష్కరణ, విద్యార్థులకు పత్రాలు పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ నాగమల్లయ్య, రిడో డైరెక్టర్ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి వినతి

రామసముద్రం, న్యూస్‌టుడే: కురిజాలలో శిథిలావస్థలో ఉన్న చంద్రాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి చేయూతనివ్వాలని గ్రామస్థులు శనివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విన్నవించారు. ఆలయ అభివృద్ధికి కొందరు అడ్డుపడుతున్నారని వాపోయారు. అధికారులు సహకరించేందుకు ఆదేశించాలని కోరారు. అందుకు ఆయన సానుకూలత వ్యక్తపరిచారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మునివెంకటస్వామి, అర్చకులు కులశేఖర్‌బట్టర్, నాగరాజ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర భారత్‌ను నిర్మించుకుందాం



స్వచ్ఛ భారత కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి గురు అరవింద్ తదితరులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: మనం దరం కలిసి పరిశుభ్ర భారత్‌ను నిర్మించుకుందామని జడ్జి గురు అరవింద్ ప్రజలకు పిలుపు నిచ్చారు. శనివారం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి పాల్గొని కోర్టు పరిసర ప్రాంతాలను న్యాయవాదులతో కలిసి పరిశుభ్రం చేశారు. కోర్టు ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్, న్యాయవాదులు రమణారెడ్డి, రవి ప్రకాష్ తదితరులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



తంబళ్లపల్లెలో ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి ఉమర్‌ఫరూక్

ములకలచెరువు, న్యూస్‌టుడే: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ అన్నారు. శనివారం తంబళ్లపల్లె ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గదులు, సరకుల నాణ్యత, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. రాత్రి వేళ పోలీసులు భద్రత పర్యవేక్షించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.

వాక్ ఫర్ ఫ్రీడం గోడపత్రాల ఆవిష్కరణ

కురబలకోట, న్యూస్‌టుడే : మానవాళి విముక్తి కోసమే వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పవిత్ర సేవా సంస్థ ప్రతినిధి ఆర్.వేమ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను తహసీల్దారు తపస్విని ఆవిష్కరించారు. స్వార్థ పరుల పైశాచిక చేష్టలకు అంతులేకుండా పోతోందని, హత్యలు, కిడ్నాప్‌ల వంటి వాటితో మహిళలు, చిన్న పిల్లలను తీసుకెళ్లి వారి జీవితాలను నాశనం చేస్తున్నారని, ఇటువంటి వాటిని అరికట్టేందుకు మహిళల్లో చైతన్యం తీసుకువచ్చే చర్యలో భాగమే గోడ పత్రికల ఆవిష్కరణగా తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, సర్వేయర్ భువనేశ్వరి, హెచ్ఎం త్రివేణి, పవిత్ర సేవా సంస్థ ప్రతినిధి ఆర్.వేమ నారాయణ, ఉపాధ్యాయ బృందం ప్రతినిధి రామకృష్ణ, బి.బాలాజీ నాయక్, వీఆర్వో నారాయణ, ప్రైజ్ సేవా సంస్థ అధ్యక్షుడు బొజ్జప్ప, గ్రామజ్యోతి అధ్యక్షురాలు సుభద్ర, రామకృష్ణ, బి.బాలాజీనాయక్, తదితరులు పాల్గొనగా, తొలుత విద్యార్థులు ఈ అంశంపై ర్యాలీ నిర్వహించారు.



గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దారు తపస్విని, చిత్రంలో పవిత్ర సేవా సంస్థ ప్రతినిధి వేమ నారాయణ, రెవెన్యూ సిబ్బంది

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాలను వెలికి తీసినప్పుడే ప్రతిభ బయటపడుతుందని విజయభారతి ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సేతు అన్నారు. శనివారం పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనాడు పత్రికా రంగంపైనే కాకుండా సేవా, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ముందుంటుందన్నారు. విద్యార్థులు ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థి పీబీ రెడ్డి సందీప్, ప్రథమ స్థానం, 8వ తరగతి విద్యార్థిని కె.లక్ష్మీ వైష్ణవి రెండో స్థానం, 9వ తరగతి విద్యార్థిని వై.శరణ్య తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ నిషిత, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విజయభారతి పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సేతు, వైస్ ప్రిన్సిపల్ నిషిత

మారుతీనగర్‌లో సమస్యల తాండవం



ఇళ్ల మధ్యలో మురుగు కుంట

నీరుగట్టువారిపల్లె (మదనపల్లె గ్రామీణ, పట్టణం) న్యూస్‌టుడే: కాట్లాటపల్లెరోడ్డులోని మారుతీనగర్‌లో ప్రజా సమస్యలు తాండవమాడుతున్నాయి. ఇక్కడ దాదాపు 500 చేనేత కార్మికులతో పాటు, వివిధ వ్యాపారాలు, భవన నిర్మాణ కూలీలు నివాసముంటున్నారు. పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఈ ప్రాంతం అటు పంచాయతీ సరిహద్దు బాబు కాలనీలో విస్తరించి ఉంది. ఇరు ప్రాంతాలు సరిహద్దులు కావడంతో అధికారులు పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తొమ్మిదేళ్ల ముందు నిర్మించిన సిమెంట్, తారురోడ్ల మినహా తరువాత విస్తరించిన ప్రాంతాల్లో ఎలాంటి రోడ్లు నిర్మించలేదు. కాట్లాటపల్లె రోడ్డులో విస్తరించి ఉన్న ప్రాంతాల్లో రోడ్లులేక, మురుగు కాలువలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు తాత్కాలిక మార్గాల్లో బురదగా మారి దుర్వాసన వస్తుంది. ఇళ్ల మధ్యలో మురుగు కుంటలుగా మారాయి. ఇక్కడ పెద్దకాలువ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎగువ ప్రాంతంలోని బాబుకాలనీ గుట్టపై నుంచి వర్షపు నీరు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు మారుతీనగర్‌లోనికి ప్రవేశిస్తుంది. దీంతో మురుగు కాలువలు పొంగిప్రవహించి ఇళ్ల మధ్య నిలబడిపోతున్నాయి.

✶ అయిదు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారు. కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని కాలనీవాసులు చెబుతున్నారు. అలాగే ఇంటింటా చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగక ఇళ్ల నుంచి కొందరు చెత్త చెదారాన్ని తీసుకొచ్చి బాబుకాలనీకి, మారుతీనగర్‌కు నడుమ రోడ్డుపై గుట్టలుగా వేస్తున్నారు. దుర్వాసనతో ఈగలు, దోమల నిలయంగా మారింది. కొన్ని వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. మరమ్మతులు చేట్టాల్సి ఉంది. కాట్లాటపల్లె రోడ్డులోని అమ్మచెరువులో చెత్తచెదారం వేస్తున్నారు. ఇక్కడ వంక చెత్తతో పూడిపోయింది. వర్షపు నీరు చెరువులోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అధికారులు స్పందించి ఇక్కడ మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.



అధ్వానంగా కాలనీలోనికి వెళ్లే రోడ్డు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

మారుతీనగర్‌లో గతంలో మురుగు నిలబడకుండా జేసీబీతో కాలువ ఏర్పాటు చేశాం. మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగునీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటాం. కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. తాగునీటి బోరులో నీటి లభ్యత తగ్గినట్లు తెలుస్తుంది. శుభ్రం చేయించి నీటి సమస్య లేకుండా చూస్తాం. చెత్తచెదారం లేకుండా పారిశుద్ధ్య పనులు చేయిస్తాం.

- శ్రావణి, డీఈ, పురపాలక సంఘం, మదనపల్లె

కాలనీకి రోడ్డు వసతి కల్పించండి

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన టీఎన్ జయసూర్యరెడ్డి కాలనీకి పక్కా రోడ్డు, తాగు నీటి సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కోరారు. శనివారం ఎంపీడీవో ఉపేంద్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తంబళ్లపల్లె టీఎన్ జయసూర్యరెడ్డి కాలనీలో రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వైవీయూ అధ్యాపకులకు అంతర్జాతీయ ప్రాజెక్టులు

వైవీయూ (కడప): యోగి వేమన విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహించే ఇద్దరు ఆచార్యులకు అమెరికా వాషింగ్టన్‌లోని హెల్త్ సొసైటీ పార్ట్నర్స్ సంస్థ ప్రాజెక్టును మంజూరు చేసింది. వృక్షశాస్త్ర ఆచార్యులు పులి చంద్ర ఓబుల్‌రెడ్డి, బయోటెక్నాలజీ ఆచార్యులు ఆచార్య అఖిల చంద్రశేఖర్ ప్రాజెక్టు పత్రాలను శనివారం వీసీ నుంచి అందుకున్నారు. మొక్కల్లో ఉండే విషపూరిత రసాయనాలను వినియోగించి ప్రజల ఆరోగ్యంపై దెబ్బ తీసే చర్యలకు భవిష్యత్తులో అడ్డుకట్ట వేసేందుకు ఈ ప్రాజెక్టు పనిచేస్తుంది.

అకాల వర్షం... అన్నదాతలకు నష్టం


నేలకొరిగిన వరి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పంట చేతి కొచ్చే సమయంలో వర్షం రూపంలో పూర్తిగా దెబ్బతింది. సకాలంలో వర్షాలు రాకపోయినా సాగు చేసుకుని పంటలు సాగు చేశారు. అయితే కోత సమయంలో తుపాను ప్రభావంతో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి సాగు చేసిన వరి సగం వరకు పూర్తిగా నేలమట్టమైంది. ఏమి చేయాలో దిక్కు తెలియక పొలం వద్ద రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మూడు ఎకరాల భూమిలో వరి సాగు చేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. చేతికొచ్చే సమయంలో వర్షం దెబ్బకి పూర్తిగా దెబ్బతిని వరి నేలమట్టమైంది. పంట దిగుబడి వస్తుందని అనుకునే లోపు వర్షం రూపంలో నష్టం వచ్చింది. ప్రభుత్వం జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలి. **- కలవ ప్రసాద్, కోనంపేట, లక్కిరెడ్డిపల్లె మండలం**

వసతి గృహాల్లో వసతులు కల్పించండి


జీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమంలో జడ్జి తేజసాయికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని బాలికల వసతి గృహాన్ని జిల్లా 5వ అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండు సమీపంలోని వన్‌స్టాప్ సెంటర్, శక్తి దన్ కేంద్రాలను పరిశీలించారు. వసతి గృహంలోని తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులను విద్యార్థులకు కల్పించాలని వసతి గృహ సంక్షేమ అధికారులకు సూచించారు. దస్త్రాలు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని తెలియచేశారు.


కోర్టు భవనాల పరిశీలన

రాయచోటిలోని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాలను శనివారం జిల్లా 5వ అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి పరిశీలించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మోల్డింగ్‌పై నీళ్లు నిలిచి పాడైపోవడాన్ని ఆయన గుర్తించారు. పదేళ్ల కిందట నిర్మించిన భవనాలపై నీరు నిలుస్తోందని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మరమ్మతులు చేపట్టాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు తెలియజేశారు.

ఓబులవారిపల్లె : ఉన్నత న్యాయసేవ అధికారుల ఆదేశాల మేరకు రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి ఓబులవారిపల్లె మండలంలోని పలు ఆశ్రమాలు, పాఠశాలలను శనివారం సందర్శించారు. పాపిరెడ్డిపల్లె వద్ద ఉన్న జీవన జ్యోతి ఆనంద నిలయం, యల్లాయపల్లె ఆశ్రమాన్ని పరిశీలించారు. అక్కడ వృద్ధులకు, పేద వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. చిన్నమయారణ్యం ఆశ్రమంలోని పాఠశాల, సంజీవపురం గురుకుల పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులు మరుగుదొడ్లు, గదులు, వారికి అందుతున్న వసతులను పరిశీలించారు. ఆశ్రమాలు, గురుకుల పాఠశాలలో వృద్ధులకు, విద్యార్థులకు వైద్యం, మౌలిక వసతులు సక్రమంగా అందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి అక్కడ ఉన్న వసతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది భ్రమరాంబ, ఎస్సై మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు గ్రామీణ : ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలని రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి తెలిపారు. మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బీసీ బాలురు, బీసీ బాలికలు, బాలురు సాంఘిక సంక్షేమ పాఠశాల, మంగంపేట అగ్రహారంలోని మినీ గురుకులం, వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. గదులు, మరుగుదొడ్లు, వంట గదులను పరిశీలించారు. పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


రాయచోటి బాలికల వసతిగృహ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అయిదో అదనపు కోర్టు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి



పారదర్శకంగా ఇసుక రవాణా

పెనగలూరు, న్యూస్‌టుడే : పెనగలూరు మండల పరిధిలో నారాయణ నెల్లూరు, కోమంతరాజపురం ఇసుక క్వారీలను రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి ప్రారంభించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం రెండు ఇసుక క్వారీల స్టాక్ పాయింట్‌లను పరిశీలించారు. టెంకాయ కొట్టి పూజలు చేశారు. ఎటువంటి అక్రమాలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు కేతా చక్రపాణి, నలమారు రాజమ్మ, తహసీల్దార్ సీహెచ్ ఇంద్రాణి, ఎంపీడీవో విజయారావు, ఆర్ఐ విజయారావు, మైనింగ్ అధికారి సుబ్బారెడ్డి, గుత్తేదారులు నరేష్ నాయుడు, విద్యాసాగర్ రెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

పుల్లంపేట, న్యూస్‌టుడే: సంపూర్ణ గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం పుల్లంపేట మండల పరిధిలోని బావికాడపల్లెలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా రూ.90లక్షలతో సీసీ రోడ్లను ఆయన భూమి పూజ చేపట్టారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తెదేపా నాయకుడు సాయివికాష్‌రెడ్డి, ఎంపీడీవో జయశ్రీలను ఘనంగా సత్కరించారు. తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.


బావికాడపల్లెలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ధ్రువపత్రాల పరిశీలన

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు అధికారులు శనివారం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పట్టణంలోని డైట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని వందలాది మంది అభ్యర్థులు తరలివచ్చారు. అధికారులు అభ్యర్థులకు ముందస్తుగా అవసరమైన ధ్రువపత్రాలు, గెజిటెడ్ సంతకాలపై వివరాలు తెలపకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ధ్రువపత్రాలు పరిశీలించేందుకు రాయచోటి ప్రాంతంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను నియమించారు. అభ్యర్థులకు సరైన వసతుల్లేక ఇబ్బందులు పడ్డారు. పరిశీలన కౌంటర్ల వద్ద నోటీసు బోర్డులలో వివరాలు పెట్టకపోవడంతో అన్ని కౌంటర్లకు తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని అభ్యర్థులు వాపోయారు. చాలా మందికి ఫోన్ ద్వారా పరిశీలనకు రావాలని డీఈవో కార్యాలయ సిబ్బంది సమాచారం అందించారు. కానీ ఇక్కడికి వచ్చి సర్టిఫికెట్లు అందచేసే సమయంలో జాబితాలో మీ పేరు లేదంటూ దరఖాస్తులు తిరస్కరించారు. కార్యక్రమాన్ని డీఈవో శివప్రకాష్‌రెడ్డి పర్యవేక్షించారు.


డైట్ కేంద్రంలో ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు

అఖిల భారత ఆత్మీయ పురస్కార కార్యక్రమానికి ఆహ్వానం

రాజంపేట, న్యూస్‌టుడే: ఈనెల 21న విజయవాడలో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఏపీ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాహితీ పురస్కార కార్యక్రమానికి రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేటు **డాక్టర్ పసుపులేటి శంకర్**కు ఆహ్వానం అందింది. ఎంతోమంది సాహితీ వేత్తలు పాల్గొంటున్న ఈ సదస్సుకు తనకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని డాక్టర్ పసుపులేటి శంకర్ తెలిపారు.



21 నుంచి గ్రామీణ యువకులకు ఉచిత శిక్షణ

కడప ఏడురోడ్లు: కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామీణ నిరుద్యోగ యువకులకు చరవాణి రిపేరింగ్-సర్వీసింగ్, ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

గ్రామాభివృద్ధికి సహకారం


వీరబల్లి: మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలీ వేదికపై ప్రజాప్రతినిధులు

వీరబల్లి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలీ పేర్కొన్నారు. వీరబల్లి ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న వార్డు మెంబర్ల, సర్పంచుల శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. శిక్షణలో తీసుకున్న అంశాలను గ్రామాల్లో వర్తింప చేసి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వచ్చిన నిధులు దుర్వినియోగం కాకుండా అభివృద్ధి పనులకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో నూర్జాహాన్, ఆయా గ్రామాల వార్డుమెంబర్లు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గాలివీడు: స్థానిక ఎంపీపీ సభా భవనంలో రెండు రోజుల పాటు గ్రామ ఉప సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించామని ఎంపీడీవో జవహర్‌బాబు పేర్కొన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధుల నిర్వహణ, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పన గురించి శిక్షణ తరగతులు జరిగాయన్నారు. నిపుణులు, గ్రామ ఉప సర్పంచులు, వార్డుల సభ్యులు పాల్గొన్నారు.

డేంజర్‌జోన్ ప్రాంత ప్రజలకు చేయూతనందించండి

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : డేంజర్ జోన్ ప్రాంత ప్రజలకు చేయూత అందించాలని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి శనివారం అమరావతిలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. ఏపీఎండీసీ సీఎస్ఆర్ ద్వారా నిర్వహిస్తున్న పాఠశాల, ఆసుపత్రి, ప్రజలకు రక్షిత తాగునీరు, దివ్యాంగులకు చేయూత, మహిళల స్వయం సహాయక సమృద్ధి కోసం కృషి చేయాలన్నారు. డేంజర్‌జోన్ పరిధిలోని ఇళ్లు, భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న యువతకు ఏపీఎండీసీ సంస్థలో ఉద్యోగాలు ఇచ్చి జీవనోపాధి కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వంపై రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారని వివరించారు. అన్ని మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని రూపానందరెడ్డి తెలిపారు.


మంత్రి కొల్లు రవీంద్రకు సమస్యలు వివరిస్తున్న తెదేపా నేత రూపానందరెడ్డి

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

రూ.6 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం

రాయచోటి, న్యూస్‌టుడే : రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో ఈ ఏడాది జూన్ 30న జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం డీఎస్పీ వివరాలు వెల్లడించారు. లక్ష్మీపురంలో జరిగిన వరుస చోరీలపై అప్పట్లో కేసు నమోదు చేసి దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం గాలివీడు రింగ్‌రోడ్డు వద్ద సంచరిస్తున్న నెల్లూరు పట్టణానికి చెందిన లింగుటేరి రాంబాబు, కావలికి చెందిన నడింపల్లి గోపీలను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.ఆరు లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన వారిపై నెల్లూరు, కావలి, కనిగిరి, వేదాయపాలెం, యలమంచిలి, పత్తిపాడు, సింగరాయకొండ, జలదంకి, పొదిలి, చిలకపూడి, పామూరు ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదై ఉన్నాయని స్పష్టం చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. సమావేశంలో పట్టణ సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

విషద్రావణం తాగి వ్యక్తి మృతి

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని కుమ్మరిపల్లె పంచాయతీకి చెందిన తుపాకుల గోవింద్‌రాజు(21) శనివారం మృతి చెందినట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కోళ్ల పెంపకంలో పనిచేస్తున్న తుపాకుల గోవింద్‌రాజు శుక్రవారం రాత్రి మద్యం తాగి తన భార్యతో గొడవ పడి విషద్రావణం తాగారు. కుటుంబ సభ్యులు వెంటనే కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

పాముకాటుతో మహిళ...

రామాపురం: పాముకాటుకు మహిళ షేక్ తహరిన్ (70) మృతి చెందినట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మండలంలోని హసనపురం పంచాయతీ కస్పాకు చెందిన తహరిన్ గత కొన్ని రోజుల కిందట గేదెలు మేపుతుండగా పాము కాటువేయడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం బెంగళూరు తరలించారు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.



రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఉత్సవాలు విజయవంతం చేయండి



గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50 సంవత్సరాల ఉత్సవాల సభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాంచరణ్ తెలిపారు. శనివారం పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాల ప్రాంగణంలో అర్ధ శతాబ్ది ఉత్సవ సభ పోస్టర్లను వారు విడుదల చేశారు.

స్పందనకు వందనం

కడప-బెంగళూరు జాతీయ రహదారిలో దేవళంపేట సమీపంలో ఏర్పడిన గుంతను పూడ్చి వేశారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో గతంలో 'మేమున్నాం మీకు తోడుగా' కింద సమస్య ప్రచురితమైంది. స్పందించిన జాతీయ రహదారి ఇంజినీరింగు అధికారులు గుంతను పూడ్చేలా చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, చిన్నమండెం**

రాయవరం గ్రామం కొత్తజంగంపల్లిలో రక్షితనీటి పథకం మోటారును పునరుద్ధరించారు. కాలిపోయిన మోటారు స్థానంలో మరొకటి అమర్చి తాగునీటి సమస్యను సర్పంచి మొహమ్మద్ షరీఫ్ పరిష్కరించారు. ఈ సమస్యపై గతంలో ఈనాడులో 'మేమున్నాం మీకు తోడుగా' భాగంగా ప్రచురితమైంది. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, సుండుపల్లి**

ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థుల సత్తా



పోటీలకు హాజరైన విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ ఎంవీ కుమార్, ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : రాజంపేట పట్టణంలోని సిల్వర్‌బెల్స్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగంతో కలిగే లాభనష్టాలు - విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఎనిమిదో తరగతి నుంచి పి. చరిష్మా, తొమ్మిదో తరగతి నుంచి పి. హర్షిణి, పదో తరగతికి చెందిన ఆర్. జాహ్నవి లక్ష్మి విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ ముక్కంటి వెంకటేశ్ కుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రాహుల్, ఉపాధ్యాయుడు రవి ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీపై విచారణ

గాలివీడు, న్యూస్‌టుడే : మండల సమాఖ్య పరిధిలో పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలకు రికవరీపై స్త్రీనిధి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎగువగొట్టివీడు పంచాయతీలో శనివారం స్త్రీనిధి బ్యాంకు అసిస్టెంటు జనరల్ మేనేజరు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో సక్రమంగా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్న గ్రామాల్లో విచారణ చేస్తున్నారని ఏపీఎం రెడ్డెయ్య తెలిపారు. సకాలంలో రుణాలు తిరిగి చెల్లించాలని ఆయన కోరారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.



ఎగువగొట్టివీడులో విచారణ చేస్తున్న స్త్రీనిధి అధికారులు

మంత్రి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

చిన్నమండెం: దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. సమస్యను నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి కొత్తగా బోరు బావి తవ్వించారు. బోరు బావిలో నీరు పుష్కలంగా పడ్డాయని, త్వరలోనే కొత్త బోరుబావికి మోటారు ఏర్పాటు చేస్తామని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపినట్లు మాజీ సర్పంచి మల్లికార్జున తెలిపారు.

మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

సుండుపల్లి, న్యూస్‌టుడే : మానవ అక్రమ రవాణా నిషేధ దినోత్సవం సందర్భంగా జి. కె. రాచపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ది మూమెంట్ ఇండియా ఆర్గనైజేషన్ సహకారంతో గుడ్‌నైబర్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు పాలు పంచుకుంటున్నాయని గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వ దృష్టికి తీసుకరావాలని కోరారు. అనంతరం ఉన్నత పాఠశాల నుంచి జి. కె. రాచపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రవీంద్ర నాయక్, గుడ్‌నైబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి వినోద్‌కుమార్, హెచ్‌ఎం సుమలత, పిల్లల సంరక్షణ లీగల్‌అధికారి కౌరున్, పీవోలు రవికుమార్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు సినిమా

సన్నీ దేవోల్.. జాట్


సన్నీ దేవోల్

బాలీవుడ్ స్టార్ సన్నీ దేవోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రణదీప్ హుడా, సయామీ ఖేర్, రెజీనా తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'జాట్' అనే పేరును ఖరారు చేశారు. శనివారం సన్నీ దేవోల్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో సన్నీ పెద్ద ఫ్యాన్‌ను చేతో పట్టుకుని యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా కనిపించారు. ఈ సినిమాని లార్జర్ దేన్ లైఫ్ యాక్షన్ డ్రామాగా భారీ హంగులతో ముస్తాబు చేస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దీని చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: రిషి పంజాబీ.


కృతిశెట్టి


కీర్తి సురేశ్

కథానాయికల నుంచి కొత్త కబురు వినిపించిందంటే చాలు.. ఆ తర్వాత సినీప్రియుల్లో మెదిలే తొలి ప్రశ్న 'మా హీరోతో జోడీ కట్టే సొగసరి ఎవర'న్నదే. దీనికి చిత్ర బృందాల నుంచి స్పష్టత వచ్చే లోపే బోలెడన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చి ప్రేక్షకుల్ని ఊరించే ప్రయత్నం చేస్తుంటాయి. ప్రస్తుతం ఇలాగే కొందరు హీరోల కొత్త చిత్రాలకు సంబంధించి పలువురు నాయికల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ప్రచారంలోకి వచ్చిన జంటలన్నీ తెరపై మురిపించాలని నియమం లేదు.

ప్రచార ఊరింపేనా.. జంటగా మురిపించేనా!


కథానాయకుడు ఎన్టీఆర్ వరుస విజయాలతో జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'వార్ 2'తో పాటు ప్రశాంత్‌నీల్ సినిమా ఒకటుంది. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) చిత్రం వచ్చే నెల నుంచి రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. దీనికోసం తారక్ జనవరి నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నారు. అయితే ఇప్పటికీ చిత్ర బృందం ఇందులో కథానాయిక ఎవరన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈ ప్రాజెక్ట్ కోసం మొదట్లో రష్మిక పేరు వినిపించినప్పటికీ ఇప్పుడు రుక్మిణీ వసంత్‌ను పరిశీలనలో ఉంచినట్లు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దసరా' విజయం తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. పాన్ ఇండియా స్థాయిలో ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. యువ హీరో విష్వక్ సేన్ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇప్పుడాయన చేయనున్న కొత్త సినిమాల్లో 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ చిత్రం ఒకటి ఉంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్ త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడిందులో నాయికగా కృతిశెట్టిని సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని.. కృతి సానుకూలంగా స్పందించిందని తెలిసింది.


రుక్మిణి | శ్రద్ధా కపూర్

కాంబో కుదిరిందా?

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. కానీ, దీని తర్వాత ఆయన చేయనున్న కొత్త చిత్రమేదన్నది ఇంకా తేలలేదు. అయితే త్వరలోనే దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. 'అర్జున్ సురవరం'తో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన టి.ఎన్. సంతోశ్.. ఇప్పుడు వెంకీతో ఓ సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. కథానాయిక కీర్తి సురేశ్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నట్లు వార్తలు ఊపందుకున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను నితిన్ సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్ నిర్మించే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది.

బజరంగ్‌బలితో బాజీరావ్ సింగమ్



రణ్‌వీర్ సింగ్

ఇతిహాసాల్లో గొప్పగా భావించే రామాయణానికి హీరోల యాక్షన్ తోడైతే ఎలా ఉంటుందో చూపించడానికి వస్తోంది 'సింగమ్ అగైన్'. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న చిత్రమిది. రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దీపికా పదుకొణె కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సింగమ్' ఫ్రాంఛైజీలో రూపొందుతున్న ఈ చిత్రంలో మరోసారి బాజీరావ్ సింగమ్‌గా సందడి చేయనున్నారు అజయ్. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఇందులోని మొదటి పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'జై బజరంగ్‌బలి..' అంటూ సాగుతున్న ఈ గీతంలో రాముడిలా అజయ్, హనుమాన్‌లా రణ్‌వీర్ పాత్రల్ని, వారి మధ్య ఉన్న అనుబంధాన్ని చూపించారు. హనుమాన్ చాలీసా నుంచి ప్రేరణ పొందిన ఈ ట్రాక్‌ను తమన్ కంపోజ్ చేశారు.



ముున్నాభాయ్ 3 సన్నాహాలు

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.net లో


అజయ్

ప్రతినాయకుడిగా.. సహాయనటుడిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు అజయ్. ఇప్పుడాయన ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని సాహిత్ మోత్కూరి తెరకెక్కించారు. ఇది ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అజయ్.

టిట్ల తర్వాత పటేల్ పాత్రతో ఆ మ్యాజిక్

★ "ఇది చిన్న కోణాలున్న కథ. పూర్తిగా 1980ల నాటి తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఓ చిన్న పాప చదువు కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. అలాగే మూఢనమ్మకాలు.. వాటిని అడ్డు పెట్టుకుని బతికే మనుషులు.. మొండితనం.. గ్రామదేవతలు.. ఇలా చాలా కోణాలు ఈ కథలో స్పృశించారు దర్శకుడు సాహిత్".

★ "ఈ చిత్ర విషయంలో నాకు సవాల్‌గా అనిపించింది ఈ కథలోని సంస్కృతిని సహజంగా తెరపైకి తీసుకురావడమే. దీంట్లో నేను పటేల్‌గా ప్రతినాయక ఛాయ ఉన్న పాత్రలో కనిపిస్తా. కొన్ని సీన్లలో వీరత్వంలా కనిపిస్తా. తెలంగాణలో సిగం (దేవుడు పూనడం) అని ఉంటుంది. అది వచ్చినప్పుడు ఆ వ్యక్తులు మాట్లాడే విధానం చాలా విచిత్రంగా ఉంటుంది. ఈ పాత్ర చేసేప్పుడు దాని మీద కొంత హోంవర్క్ చేశా. నేను చేసిన సినిమాల్లో 'విక్రమార్కుడు'లోని టిట్ల పాత్ర నాకెంతో పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత అలాంటి పాత్రలు కొన్ని ప్రయత్నించినా ఆ మ్యాజిక్ మళ్లీ కుదర్లేదు. కానీ, ఈ సినిమా ఆ లోటు తీరుస్తుందనిపిస్తోంది. నటుడిగా నాకెంతో ఆనందాన్నిచ్చిన పాత్రిది".

★ "ఈ చిత్రసీమలో 25 ఏళ్లుగా నటుడిగా ఉండగలగడం మామూలు విషయం కాదు. ఇన్నేళ్లు ఇక్కడ నిలకడగా కొనసాగడం నా వరకు పెద్ద గిఫ్ట్. కెరీర్ ఆరంభంలో 250 సినిమాలు చేసే పరిస్థితి ఇప్పుడు లేదు. ఈ ఏడాది నాకు 'దేవర', 'మత్తువదలరా 2' లాంటి రెండు పెద్ద విజయాలు దక్కాయి. ఇటీవలే నేను 'సింగం అగైన్' చేశాను. 'పుష్ప 2', 'గరుడన్' తెలుగు రీమేక్ తదితర చిత్రాలు చేస్తున్నా".

బతుకే నటన

శివకుమార్ రామచంద్రవరపు, నిదిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో రిషికేశ్వర్ యోగి తెరకెక్కించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, సింధు రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుకను నిర్వహించారు. హీరో సుధీర్‌బాబు, దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తదితరులు అతిథులుగా హాజరయ్యారు. "ఈ సినిమాని అందరూ చూసి, ఆశీర్వదించాలని కోరుతున్నా" అన్నారు దర్శకుడు రిషికేశ్వర్.


సింధు, సుధీర్‌బాబు, విశ్వప్రసాద్, రిషికేశ్వర్, శివ

సైన్స్‌కు అతీంద్రియ శక్తులు కలిస్తే.. శంబాల


ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ తన రాబోయే సినిమా కోసం సైంటిస్ట్ అవతారమెత్తారు. తాజాగా ఆయన ప్రధాన పాత్రలో 'శంబాల' అనే చిత్రంలో నటిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో యుగంధర్ ముని దీన్ని తెరకెక్కిస్తున్నారు. అనంది కథానాయిక. శనివారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "అతీంద్రియ శక్తులకు సైన్స్ కలిస్తే.. ఆ నిజం కల్పితాల కంటే భయంకరంగా ఉంటుంది" అని వ్యాఖ్యల్ని జోడించింది. దీన్ని షైనింగ్ పిక్చర్స్ పతాకంపై రాజశేఖర్, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఓ యువకుడి జీవితం స్ఫూర్తితో!


అనన్య, రాకేశ్

రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి తెరకెక్కించారు. అనన్య కృష్ణన్ కథానాయిక. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. నటి అనసూయ, దర్శకుడు సాయి రాజేశ్ అతిథులుగా హాజరయ్యారు. హీరో రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ.. "బంజారా వర్గానికి చెందిన ఓ యువకుడి నిజ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాని తెరకెక్కించాం" అన్నారు దర్శకుడు అంజి.

సమగ్ర వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి


పంట దిగుబడి కొలతలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రామాపురం, న్యూస్‌టుడే : పొలంబడి కార్యక్రమంలో భాగంగా గోపగుడిపల్లె పంచాయతీలో వేరుసెనగ పంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహించామని మండల వ్యవసాయ అధికారిని నాగమణి అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడుతూ.. సమగ్ర వ్యవసాయ పద్ధతిలో పొలంలో అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు విద్యార్థినుల ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఏఐటీఎస్ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ నారాయణ

రాజంపేట, న్యూస్‌టుడే: దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహిస్తున్న మహిళా కబడ్డీ పోటీలకు రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అకిలారెడ్డి, మానస ఎంపికైనట్లు ఏఐటీఎస్ వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. ఇటీవల చిత్తూరులో ఎస్వీసీఈ కళాశాలలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చాటి తమిళనాడులోని అలగప్ప యూనివర్సిటీలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ మేరకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు డాక్టర్ బి.నాగముని, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన ప్రణీత్‌తో వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరి

నందలూరు: నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ప్రణీత్ యోగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం కడప వైఎస్సార్ ఇండోర్ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రణీత్, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరిని అభినందించారు.

ఉచిత ఇసుకకు మార్గదర్శకాలు ఇవ్వండి

రాజంపేట, న్యూస్‌టుడే: సమీపంలోని రేవుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చని సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ కోరారు. రాజంపేటలో ఆయన మాట్లాడుతూ తమ అవసరాలకు వంకల్లో, నదుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చని సీఎం చెబుతుంటే ఇక్కడేమో అధికారులు ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని, సీజ్ చేస్తున్నారని తెలిపారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో ఎక్కడి నుంచైనా తీసుకెళ్లవచ్చా, లేదంటే ఒక చోట నుంచే తీసుకెళ్లాలా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండు చేశారు. మార్గదర్శకాలు లేకపోవడంతో అధికారులు దాడులు చేయడంతో ట్రాక్టర్ల యజమానులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

రైతులను ఆదుకోవాలని డిమాండు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆరు నియోజకవర్గాల్లో అరటి, బొప్పాయి, టమాట, తమలపాకుల తోటలు దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పంటలు పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా మొత్తాన్ని ఖాతాలలో జమ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆర్టీసీ ప్రాంగణం... నిర్వహణ అస్తవ్యస్తం

రాజంపేటలో రూ.కోట్ల విలువైన భూమి, భవనాలు నిరుపయోగం


రాజంపేట ఆర్టీసీ ప్రాంగణంలో మురుగునీరు ఇలా...

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : గత పాలకుల నిర్లక్ష్యంతో రాజంపేట ఆర్టీసీ ప్రాంగణంలో సమస్యలు నెలకొన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. రాజంపేట పట్టణం నడ్డిబొడ్డున ఆర్టీసీ ప్రాంగణం ఉంది. దాదాపు 20 ఎకరాల విస్తీర్ణం మూడు వైపులా ప్రధాన రహదారులున్నాయి. వ్యాపార సముదాయాలు నిర్వహించడానికి అనువైన ప్రాంతం. అన్ని రకాల అవకాశాలున్నా రూ.కోట్లు విలువ జేసే ఆర్టీసీ భూమి నిరుపయోగంగా మారింది.

● రాజంపేట ఆర్టీసీ ప్రాంగణం వర్షపు నీరు, కార్మికులు వసతి గృహాలకు ఏర్పాటు చేసిన మంచి నీటి పైపులైన్లు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో నీరంతా ఆర్టీసీ ఆవరణంలో చేరి పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రాంగణంలోకి పందులు, మూగ జీవాలు రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా మురుగు నీటితో నిండిపోయింది. కేవలం చిన్నపాటి చర్యలు తీసుకుంటే ఈ సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

● ఆర్టీసీ ఆవరణంలో రూ.కోట్లు విలువ చేసే భూములున్నాయి. గతంలో రాజంపేట ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు నివాసం ఉండేందుకు వసతి సముదాయాలను నిర్మించారు. గత పదేళ్లుగా వసతి సముదాయాల్లో సిబ్బంది లేకపోవడంతో రూ.కోట్లు విలువైన భూమి, భవనాలు నిరుపయోగంగా మారాయి. దీంతో స్థానికంగా ఉన్న మందుబాబులు, జూదం ఆడేవారికి అడ్డాగా మారింది. ఇక్కడ ఏర్పాటు చేసిన పైపులు నుంచి నీరు రావడంతో ఆర్టీసీ ఆవరణం అంతా మురుగు నీటితో నిండి దుర్వాసన వస్తోంది.

ప్రభుత్వానికి నివేదించాం

రాజంపేట ఆవరణంలో మురుగు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశాం. గతంలో నిర్మించిన వసతి గృహాలు నిరుపయోగంగా మారాయి. వీటిని తొలగించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వీటిని తొలగించి, వ్యాపార సముదాయాలకు భూములు కేటాయించడానికి చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీకి ఆదాయం వచ్చే వనరులను సద్వినియోగం చేసుకుంటాం. **- రమణయ్య, ఆర్టీసీ డీఎం, రాజంపేట**

కంకర పరిచారు... నిర్మాణం మరిచారు



చిన్నమండెం మండల పరిధిలోని సి.పొలిమేరపల్లెలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి కంకర పరిచి ఏడాది అవుతున్నా నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే చెప్పులు ఉండాల్సిందే. చిన్నమండెం-దేవపట్ల ప్రధాన రోడ్డు నుంచి సి.పొలిమేరపల్లెకు తారు రోడ్డు మంజూరు చేశారు. గ్రామంలో మాత్రం సిమెంటు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదట రోడ్డును చదును చేసి కంకర పరిచి, మురుగు కాలువ నిర్మించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సిమెంటురోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిన్నమండెం**

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి


రాజంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


పుల్లంపేటలో ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు

రాజంపేట, న్యూస్‌టుడే: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా వారిలోని నైపుణ్యాలను వెలికి తీయవచ్చునని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఓబులేసు తెలిపారు. ఈ మేరకు మన్నూరు భవిత కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. భవిత కేంద్రం ఐఈఆర్పీ నాగమణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : నందలూరు మండల విద్యాధికారులు నాగయ్య, అనంతకృష్ణల ఆదేశాల మేరకు శనివారం సమ్మిళిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థుల్లో అభ్యసనా వైకల్యాలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి మాట్లాడుతూ అక్షరాలను తలకిందులుగా రాయడం, అక్షరాలు వదిలి చదవడం, రాయడం, గణితంలో, మాట్లాడడంలో, అర్థం చేసుకోవడంలో, గుర్తించడంలో సమస్యలున్న పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి చిన్న వయసు నుంచే వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తే వారి సామర్థ్యాలు మెరుగు పడి అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధర, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట, చిట్వేలి : పుల్లంపేట, చిట్వేలి మండలాల్లో భవితా కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ఎంఈవోలు కోదండనాయుడు, ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయా భవితా కేంద్రాల పరిధిలోని ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు విజయకుమారి, సునీత, వెంకటసుబ్బయ్య, శిరీష, ఉపాధ్యాయులు శివలక్ష్మి, రజియా పాల్గొన్నారు.

గాలివీడు : దివ్యాంగుల పిల్లలలో పురోభివృద్ధిని పెంచాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగుల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని కోరారు. వివిధ అంశాలపై విద్యార్థులకు తగిన సూచనలిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ హెచ్ వెంకటచలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సీడీపీవో పద్మావతి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చింతకుంటవాండ్లపల్లె, రెడ్డివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సామాజిక వేదిక నిర్వహించినట్లు సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది అయేషా, స్వప్న, సల్మా, రజియా, సుజాత, పుష్ప, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

రామాపురం : పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని గువ్వలచెరువులో సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలు, మహిళలకు ఆరోగ్యం, ఆహార పద్ధతులపై అవగాహన కల్పించారు. పోషకాహారంతో పాటు మునగాకు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, పద్మజ, సిబ్బంది, పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి


రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం రెవెన్యూ సీనియర్ అసిస్టెంటు కిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. అధికారులు చొరవ తీసుకుని మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పుల్లంపేట కార్యదర్శి సెల్వన్‌కుమార్, రైల్వేకోడూరు కార్యదర్శి చిన్నయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ, పెంచలయ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం


ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌లో దస్త్రాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. కేసుల నమోదు రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చోరీల నియంత్రణపై నిఘా ఉంచామన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. బాలికలు, యువతులు, మహిళలను వేధింపులకు గురి చేసే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్ స్థావరాలపై సమాచారమిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఒంటిమిట్టలో పోలీసు నివాస గృహాలకు గతంలో కేటాయించిన స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. అనంతరం ఒంటిమిట్టలో తితిదే పరిపాలన కార్యాలయంలో రామాలయం భద్రతపై మంగళగిరి ఆక్టోపస్ డీఎస్పీలు పి.జగ్గునాయుడు, ఐ.తిరుపతయ్యలతో కలిసి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో ప్రసిద్ధ ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై గతంలో ఉగ్రమూకలు దాడులు చేసినట్లు తెలిపారు. మీ ప్రాంతంలో కొత్త వ్యక్తులు తిరుగుతున్నట్లు అనుమానం ఉంటే తక్షణమే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించాలని తెలిపారు. డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సీఐ కృష్ణంరాజునాయక్, ఉప తహసీల్దారు అంజనా గౌరి, ఎస్.ఐ శివప్రసాద్, వైద్యాధికారిణి హిమశ్వేత పాల్గొన్నారు.